సాక్షి రంగారెడ్డి

మంగళవారం। 20। ఫిబ్రవరి। 2024



గంధం చెట్లు గాయబ్!

యాచారం మండలం నందివనపర్తిలో దుండగులు రెచ్చిపోతున్నారు. ఇష్టారీతిన గంధం చెట్లు నరికి తీసుకెళ్తున్నారు. 8లో▸



అర్హులందరికీ సర్టిఫికెట్లు

అర్హులైన ప్రతి ఒక్కరికీ సదరం సర్టిఫికెట్లు అందించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. 8లో▸



నేటి నుంచి సమతాకుంభ్..

శ్రీరామానుజాచార్య. 108 దివ్య దేశాల ద్వితీయ బ్రహ్మోత్సవాలకు శ్రీరామనగరం ముస్తాబైంది.. 8లో▸

న్యూస్‌రీల్

విదేశీ విద్య పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించాలనుకునే పేద మైనార్టీ విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి విదేశీ విద్య పథకం కింద ఉపకార వేతనం పొందడానికి (ఫాల్ సీజన్ 2023) అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి నవీన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందే విద్యార్థులు ఎంపిక చేసిన విదేశీ యూనివర్సిటీల్లో 1 ఆగస్టు 2023 నుంచి 31 డిసెంబర్ 2023 వరకు ప్రవేశం పొంది ఉండాలన్నారు. అర్హత గల వారు ఈనెల 20 నుంచి మార్చి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు చేవెళ్ల లోక్‌సభ స్థానంపై కాంగ్రెస్ సమావేశం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం మంగళవారం మొయినాబాద్ మండలం చిలుకూరు సమీపంలోని జేపీఎల్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, వికారాబాద్ జెడ్పీ చైర్ పర్సన్ సునీతారెడ్డి, పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్‌ఆర్, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్ తదితరులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు అంశంపై ప్రధానంగా చర్చ జరుగుతుందని తెలిపారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



చిలుకూరు బాలాజీ దేవాలయంలో శివాజీ చిత్రపటంతో ప్రదక్షిణలు చేస్తున్న అర్చకులు

మొయినాబాద్: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. చిలుకూరు బాలాజీ దేవాలయంలో ఆలయ అర్చకులు శివాజీ చిత్రపటం, మునివాహన సేవ విగ్రహంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ అర్చకుడు రంగరాజన్ ఛత్రపతి శివాజీ మహరాజ్ వీరత్వాన్ని కొనియాడారు. మహారాష్ట్రతోపాటు భారతదేశమంతా గౌరవించదగ్గ వ్యక్తి అని ఆయన గొప్పతనాన్ని భక్తులకు వివరించారు. చిలుకూరు బాలాజీ దేవాలయం కమాన్ వద్ద ఉన్న ఛత్రపతి శివాజీ విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ దర్గ మహేందర్, మాజీ ఎంపీటీసీ సహదేవ్, మాజీ ఉపసర్పంచ్ ఆంద్రూ, నాయకులు నరేందర్, మహేష్‌చారి తదితరులు ఉన్నారు.

అధిక సాంద్రత పద్ధతిలో సాగు మేలు



హెచ్‌డీపీఎస్ ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

హయత్‌నగర్: అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుతో మంచి లాభాలు వస్తాయని.. సరైన సమయంలో నిపుణుల సలహాతో సాగు చేయాలని నాగపూర్ పత్తి పరిశోధనా సంస్థ డైరెక్టర్ వై.జి.ప్రసాద్ అన్నారు. హయత్‌నగర్‌లోని కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించిన రైతు మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధిక సాంద్రత పద్ధతిలో విత్తన శుద్ధి దగ్గర నుంచి ఎరువుల వాడకం, నీటి యాజమాన్యం, కలుపు నివారణ, యాంత్రీకరణ తది తరాలపై ఎప్పటికప్పుడు నిపుణుల సలహాలు తీసుకోవాలని సూచించారు. క్రీడా డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రైతులు ఆధునిక పద్ధతులు అవలంబిస్తూ పత్తిని సాగు చేస్తే అధిక లాభాలతోపాటు ఖర్చును కూడా తగ్గించుకోవచ్చన్నారు. కేవీకే హెడ్ రమణ మాట్లాడుతూ.. రైతులకు తగిన సలహాలు సూచనలు ఇచ్చేందుకు శాస్త్రవేత్తలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని స్పష్టం చేశారు. జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి పత్తిలో నూతనంగా వచ్చిన వంగడాలు.. వాటి వినియోగంపై రైతులకు వివరించారు. అధిక సాంద్రత పద్ధతిలో కలుపు నివారణపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు వాణి, విజయ్‌కుమార్, సుధీర్, రామకృష్ణ, సుదర్శన్‌రెడ్డి, సునీత, సాయివర్ధన్ తదితరులు రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా హెచ్‌డీపీఎస్ ప్రచురించిన కాటన్ ప్రాజెక్టు వివరాల పుస్తకాన్ని ఆవిష్కరించి రైతులకు అందజేశారు.

'రూఫ్‌టాప్' కాంతులు

గ్రేటర్‌లో సౌరవిద్యుత్‌పై ఆసక్తి

- పెరుగుతున్న నెలవారీ విద్యుత్ ఛార్జీలు
- ప్రత్యామ్నాయం దిశగా వినియోగదారుల అడుగులు
- అందుబాటులోకి 'పీఎం ముఫ్త్ బిజ్లీ యోజన పథకం' పోర్టల్
- నెలకు 300 యూనిట్లు ఉచితం.. రాయితీపై బ్యాంకు రుణ సౌలభ్యం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: హైదరాబాద్‌లోనే అతిపెద్ద గేటెడ్ కమ్యూనిటీగా గుర్తింపు పొందిన మాదాపూర్‌లోని ఫార్చ్యూన్ టవర్స్‌పై నిర్వాహకులు 250 కిలో వాట్స్ సోలార్ రూఫ్ టాప్ పలకను ఏర్పాటు చేసుకున్నారు. రోజుకు సగటున వెయ్యి యూనిట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. నెలకు సగటున రూ.3 లక్షల వరకు విద్యుత్ బిల్లు ఆదా అవుతోంది. ఈ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు నిర్వాహకులు పెట్టిన పెట్టుబడి అంతా మరో ఐదేళ్లలో తీరిపోతుంది. ఆ తర్వాత వారికి పూర్తిగా సోలార్ విద్యుత్ ఉచితంగా అందనుంది.. ఇలా వీరొక్కరే కాదు గ్రేటర్‌లో సుమారు 3,500 మంది వినియోగదారులు తమ ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ పలకలను ఏర్పాటు చేసుకుని, సొంతంగా విద్యుత్ ఉత్పత్తి చేసుకుంటున్నారు. ఇంటిపై ఉత్పత్తి అయిన విద్యుత్‌తో సొంత అవసరాలు తీర్చుకుంటూ.. మిగిలిన విద్యుత్‌ను డిస్కంకు విక్రయిస్తున్నారు. దేశ వ్యాప్తంగా కోటి ఇళ్లలో సౌర విద్యుత్ వెలుగులు నింపే లక్ష్యంతో తాజాగా కేంద్రం 'పీఎం సూర్యఘర్ ముఫ్తీ బిజ్లీ యోజన' పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. రేషన్‌కార్డు ఉన్న ప్రతి లబ్ధిదారునికి నెలకు సగటున 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందించే కార్యక్రమంలో భాగంగా కొత్తగా రూఫ్‌టాప్ సోలార్ పలకలు ఏర్పాటు చేసుకోవాలని భావించే వారికి పలు ప్రోత్సాహకాలు అందజేస్తోంది.

మూడు కిలోవాట్లు..78 వేల సబ్సిడీ

ఇంటిపై మూడు కిలోవాట్ల సౌరపలకలు ఏర్పాటు చేయాలంటే 225 చదరపు అడుగుల విస్తీర్ణం అవసరం. ఒక కిలోవాట్ సౌరపలక రోజుకు సగటున 4 యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుంది. మూడు కిలోవాట్ల సామర్థ్యం ఉన్న పలకలు ఏర్పాటు చేసుకుంటే నెలకు సగటున 360 యూనిట్లు ఉత్పత్తి అవుతుంది. ఏడాదికి 4,320 యూనిట్లు ఉత్పత్తి అవుతుంది. ఇంటి అవసరాలు నెలకు 200 యూనిట్లు పోగా మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అమ్ముకోవచ్చు. ఇందుకు ప్రస్తుత ధర ప్రకారం యూనిట్‌కు రూ.5.05 చెల్లిస్తుంది. మూడు కిలోవాట్లకు రూ.1.80 లక్షలు ఖర్చు అవుతుంది. గతంలో రాయితీ కిలోవాట్‌కు రూ.14 వేల చొప్పున మూడు కిలోవాట్లకు రూ.42 వేలే లభించేది. దీంతో చాలా మంది విముఖత చూపేవారు. ప్రస్తుతం ఈ సబ్సిడీని రూ.78 వేలకు పెంచింది. అంతేకాదు మిగిలిన మొత్తం చెల్లింపునకు రాయితీపై బ్యాంకుల నుంచి రుణాలు పొందేలా కేంద్రం ఏర్పాటు చేసింది. ఒక రకంగా చెప్పాలంటే పైసా ఖర్చు లేకుండా యూనిట్ ఏర్పాటు చేసుకోవచ్చు. ఉత్పత్తి అయిన విద్యుత్‌లో ఇంటి అవసరాలు పోగా, మిగిలిన విద్యుత్‌ను నెట్‌మీటరింగ్ ద్వారా డిస్కంకు విక్రయించడం ద్వారా వచ్చే సొమ్ముతో బ్యాంకు రుణం తీర్చవచ్చు.

40 మందికిపైగా దరఖాస్తు

సౌరపలకల జీవితకాలం 25 ఏళ్లను పరిగణలోకి తీసుకుంటే 5.32 సంవత్సరాల్లోనే పెట్టిన పెట్టుబడి అంతా తిరిగి వస్తుందని చెబుతున్నారు. మిగిలిన కాలానికి ఉచితంగా విద్యుత్‌ను వినియోగించుకోవచ్చు. సౌర విద్యుత్‌తో పర్యావరణ ప్రయోజనాలు లేకపోలేదు. మూడు కిలోవాట్ల సోలార్ ప్యానళ్ల ఏర్పాటుతో 25 ఏళ్లలో 85 టన్నుల కార్బన్ డయాక్సైడ్‌ను తగ్గించిన వారవుతారు. ఇదిలా ఉంటే సోలార్ విద్యుత్ ఉత్పత్తిదారులను ప్రోత్సహించేందుకు కేంద్రం జాతీయ స్థాయిలో 'పీఎం సూర్య ఘర్' పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. కేవలం వారం రోజుల వ్యవధిలోనే గ్రేటర్ జిల్లాల నుంచి 40 మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. ఔత్సాహికులు టీఎస్ ఎస్‌పీడీసీఎల్ వెబ్ సైట్‌లోకి వెళ్లి డిస్కం పేరు, కరెంట్ కనెక్షన్, ఫోన్ నంబర్, ఈమెయిల్ ఐడీ, ఆధార్ నంబర్ వంటి వివరాలను ఈ పీఎం సూర్య ఘర్ పోర్టల్‌లో నమోదు చేయాలి. ఎంపిక చేసిన కంపెనీల సోలార్ పలకలు, రాయితీపై రుణాలు ఇచ్చే బ్యాంకులు, టెక్నీషియన్ల వివరాలు కూడా ఇక్కడ ఉంటాయి. పలకల ఇన్‌స్టలేషన్ తర్వాత నెట్‌మీటరింగ్ ద్వారా గ్రిడ్‌కు అనుసంధానం చేస్తారు.

సర్కిళ్ల వారీగా సోలార్ కనెక్షన్లు.. ఉత్పత్తి ఇలా..

సర్కిల్	కనెక్షన్లు	విద్యుత్ ఉత్పత్తి
మేడ్చల్	440	10.5 మెగావాట్లు
రాజేంద్రనగర్	228	10 మెగావాట్లు
హబ్సిగూడ	440	10 మెగావాట్లు
బంజారాహిల్స్	598	8 మెగావాట్లు
సైబర్‌సిటీ	360	6.8 మెగావాట్లు
సికింద్రాబాద్	370	4.8 మెగావాట్లు
హైదరాబాద్ సెంట్రల్	290	4.4 మెగావాట్లు
హైదరాబాద్ సౌత్	190	3.6 మెగావాట్లు
సరూర్‌నగర్	270	2.8 మెగావాట్లు

రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటుకు ఖర్చు, సబ్సిడీ ఇలా..

కిలోవాట్స్	చ.అ.వి	విద్యుత్ ఉత్పత్తి (యూనిట్లు)	స్థాపిత ఖర్చు	ప్రభుత్వ సబ్సిడీ
2	150	240	రూ.1,44,000	రూ.62400
3	225	360	రూ.2,06,400	రూ.78000
4	300	480	రూ.2,59,600	రూ.78,000
5	375	600	రూ.3,24,500	రూ.78,000
6	450	720	రూ.3,89,400	రూ.78,000
8	600	960	రూ.5,19,200	రూ.78,000
10	750	1200	రూ.6,49,000	రూ.78,000



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శశాంక

విన్నపాలు వినవలె..

- ప్రజావాణికి అర్జీల వెల్లువ
- జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన బాధితులు
- అత్యధిక ఫిర్యాదులు భూములకు సంబంధించినవే..
- సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి బాధితులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. స్వయంగా కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ వేదికగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణికి జిల్లా నుంచి ఐదు వేలకుపైగా దరఖాస్తులు అందాయని, వాటిని సత్వరమే పరిష్కరించాలని సూచించారు. వీటిలో రెండు వేల దరఖాస్తులు గృహాలకు సంబంధించినవి ఉండగా, 1300 భూ సంబంధిత సమస్యలకు సంబంధించినవి కాగా, మరో 500 పెన్షన్లకు సంబంధించి ఉన్నట్లు తెలిపారు. అధికారులు తక్షణమే వాటిని పరిష్కరించాలన్నారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని.. ఒకవేళ వినతులు పరిష్కారం కానట్లయితే, అందుకు గల కారణాలను స్పష్టంగా పేర్కొనాలని సూచించారు.

అందిన ఫిర్యాదులు ఇవే..

సోమవారంమొత్తం 114 ఫిర్యాదులు అందాయి. వీటిలో దివ్యాంగుల సంక్షేమశాఖకు సంబంధించి 2, మైన్స్ 1, ఏడీ సర్వే అండ్ లాండ్స్ 1, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ 1, డీఎంహెచ్‌ఓ 1, జిల్లా పంచాయతీ 1, జీఎండీఐసీ 1, పశు సంవర్ధకశాఖ 1, డీఆర్‌డీఓ 2, సెక్షన్ డీకి 20, సెక్షన్ ఈకి 1, సెక్షన్ ఎఫ్‌కి సంబంధించిన ఫిర్యాదులు 2 ఉన్నాయి. భూ సమస్యలకు సంబంధించిన సమస్యలపై ఫిర్యాదులు అబ్దుల్లాపూర్‌మెట్ నుంచి 13, ఆమనగల్లు నుంచి 2, బాలాపూర్ నుంచి 5, చేవెళ్ల నుంచి 4, చౌదరిగూడెం నుంచి 2, ఫరూఖ్‌నగర్ నుంచి 2, గండిపేట్ నుంచి 1, హయత్ నగర్ నుంచి 1, ఇబ్రహీంపట్నం నుంచి 2, కడ్తాల్ నుంచి 2, కందుకూరు నుంచి 13, కొందుర్గు నుంచి 1, కొత్తూరు నుంచి 1, మాడ్గుల నుంచి 1, మహేశ్వరం నుంచి 7, మంచాల నుంచి 1, మొయినాబాద్ నుంచి 1, నందిగామ నుంచి 2, షాబాద్ నుంచి 2, శంషాబాద్ నుంచి 3, శంకర్‌పల్లి నుంచి 2, తలకొండపల్లి నుంచి 2 చొప్పున అందాయి.

శాఖల వారీగా రిజిస్టర్

ఫిర్యాదుల పరిష్కారం కోసం జిల్లాలోని అన్ని శాఖలు ప్రజావాణి కోసం ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఎప్పటికప్పుడు ఆయా ఫిర్యాదులను రిజిస్టర్‌లో నమోదు చేయడం ద్వారా పరిష్కారం సులభమవుతుందని చెప్పారు. ప్రతి వారం ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి? ఎన్ని పరిష్కరించారు? ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? వంటి విషయాలు తెలుస్తాయన్నారు. ప్రజావాణికి వచ్చేటప్పుడు విధిగా రిజిస్టర్ తీసుకు రావాలని సూచించారు. అధికారులంతా ఈ ఆఫీసు ద్వారా కార్యకలాపాలు నిర్వహించాలన్నారు. జిల్లా స్థాయి శాఖలకు, సామాజిక మాధ్యమంలో ట్విటర్ అకౌంట్ తెరవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి, డీఆర్‌ఓ సంగీత, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మంత్రిని కలిసి సమస్యలు వివరిస్తున్న రేషన్ డీలర్లు

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరిస్తాం

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మహేశ్వరం: రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. మండలంలో పని చేస్తున్న రేషన్ డీలర్లు వారు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో రేషన్ కార్డు కలిగిన వారికి 9 రకాల సరుకులను బ్యాగుల్లో అందించిన విషయాన్ని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలా రేషన్ డీలర్లను ఇబ్బందులు పెట్టమని, సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పులిమామిడి లక్ష్మీనారాయణ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ విజయ్ సూర్య, డీలర్లు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, కృష్ణ గౌడ్, శివ యాదవ్, ఎం.బాబు, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్కాన్ ఎనర్జీ పరిశ్రమలో పేలిన బట్టీ

- ముగ్గురు కార్మికులకు తీవ్ర గాయాలు
- కొందుర్గులో ఘటన

కొందుర్గు: పరిశ్రమలో బట్టీ పేలి ముగ్గురు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా కొందుర్గులోని స్కాన్ ఎనర్జీ పరిశ్రమలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పరిశ్రమలో సోమవారం మధ్యాహ్నం భారీగా పేలుడు శబ్దం రావడంతో స్థానికులు, పోలీసులు పరిశ్రమ వద్దకు చేరుకున్నారు. పరిశ్రమలో ఓ బట్టీ పేలి పనిచేస్తున్న పలువురికి గాయాలైనట్లు తెలిసింది. పోలీసులు, అధికారులు విచారణ చేపట్టగా పరిశ్రమలో ఇనుమును కరుగదీయడానికి బట్టీ కాలుస్తుండగా ప్రమాదవశాత్తు పేలి బీహార్‌కు చెందిన అనిల్ పాశ్వన్ (35), కమల్ కిశోర్ (30), మహేందర్ యాదవ్ (35) తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన కార్మికులను పరిశ్రమ యాజమాన్యం చికిత్స కోసం షాద్‌నగర్ పట్టణంలోని శివరామ్‌నాయక్ ఆస్పత్రికి తరలించారు. పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఇంకా చాలామంది గాయపడి ఉండొచ్చని, యాజమాన్యం బయటికి పొక్కనివ్వకుండా చేస్తోందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు ఈ పరిశ్రమలో తరుచూ జరుగుతున్నా అటు యాజమన్యాం, ఇటు అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఎస్సై కృష్ణయ్య, షాద్‌నగర్ రూరల్ సీఐ వెంకట్ రెడ్డి, కొందుర్గు తహసీల్దార్ రమేష్ కుమార్ సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు.



మంటల్లో కాలిపోయిన బట్టీ

పుట్టెడు బాధలోనూ అవయవదానం

- ముందుకొచ్చిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబసభ్యులు

ఇబ్రహీంపట్నం రూరల్: తాను మరణించినా తన అవయవాలు మరికొందరికి ఉపయోగపడాలని దానం చేసి ఆదర్శంగా నిలిచాడు ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లికి చెందిన మేకల శ్యాంసుందర్(42). మాడ్గుల పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించే అతను 25 రోజుల క్రితం ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో విధులు ముగించుకొని ఇంటికి తిరిగి వస్తుండగా బైక్ మీద నుంచి కిందపడిపో యాడు.అప్పటి నుంచి ఓ ప్రైవే టు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బ్రె యిన్‌స్ట్రోక్ రావడంతో ఆపరేషన్ చేశారు. అయినా ప్రయోజనం లేక తుదిశ్వాస విడిచాడు. మరణాంతరం అతని అవయవాలు నలుగురికి ఉపయోగపడాలని దానం చేయడానికి కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. పోలీసు అధికారుల సమక్షంలో అవయవాలు దానం చేశారు. శ్యాంసుందర్ అంత్యక్రియలు స్వగ్రామం నాగన్‌పల్లిలో సోమవారం సాయంత్రం జరిగాయి. శ్యాంసుందర్‌కు భార్య లికిత, పిల్లలు యోగిత, పరిమళ, సాయి ఉన్నారు. పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.



శ్యాంసుందర్ (ఫైల్)

బస్సులన్నీ మేడారం బాట

పల్లెలకు రద్దయిన ట్రిప్పులు

- ప్రయాణికులకు ఇబ్బందులు
- గంటల తరబడి పడిగాపులు
- దిక్కయిన ప్రైవేటు వాహనాలు

షాద్‌నగర్/ఇబ్రహీంపట్నం: దైవ దర్శనానికి వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ అధికారులు బస్సులను పంపించారు.. పల్లెలకు ట్రిప్పులు రద్దు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ములుగు జిల్లా మేడారంలో నిర్వహించే సమక్క సారలమ్మ జాతరకు లక్షల సంఖ్యలో భక్తులు వెళ్తుంటారు. వారి సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను కేటాయించారు. షాద్‌నగర్ డిపోలో ఉన్న మొత్తం 86 బస్సుల్లో 43 జాతరకు కేటాయించారు. మిగిలిన సగం బస్సులను డిమాండ్ ఎక్కువగా ఉండే రూట్లలో నడిపిస్తున్నారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, రైతులు.. ఇలా నిత్యం బస్సుల్లో ప్రయాణించే వారు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై నిలబడి గంటల తరబడి బస్సుల కోసం ఎదురు చూస్తున్నారు.

ఈనెల 26 వరకు రద్దు

డిపోలో ఉన్న 43 బస్సులు మేడారం జాతరకు వెళ్లాయని, పది రోజుల పాటు పల్లెలకు ట్రిప్పులు రద్దు చేసినట్లు అధికారులు ప్రకటన పత్రాలను బస్టాండ్ గోడలకు అంటించారు. హైదరాబాద్, మహబూబ్‌నగర్, చేవెళ్లకు మాత్రమే బస్సులు నడిపిస్తున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 26వ వరకు పల్లెలకు బస్సులు రద్దు చేసినట్లు, ప్రయాణికులు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. చాలా మంది ప్రయాణికులకు బస్సుల రద్దు విషయం తెలియకపోవడంతో అధికారుల వద్దకు పరుగులు పెడుతున్నారు.

తప్పని అవస్థలు

మూడు రోజుల నుంచి బస్సులు రద్దు కావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. ఆయా గ్రామాల్లో పాఠశాలలకు నిత్యం వెళ్లే ఉపాధ్యాయులు రోడ్లపై నిలబడి ప్రైవేటు వాహనాల కోసం ఎదురు చూస్తున్నారు. బస్సుల రద్దుతో షాద్‌నగర్, హైదరాబాద్, మహబూబ్‌నగర్‌లో ఉండే పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు వెళ్లడం లేదు. ఉన్న కొద్ది పాటి బస్సుల్లో రద్దీ అధికంగా ఉండటంతో అవస్థలు పడుతున్నారు.



షాద్‌నగర్ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

పట్నం డిపోలోనూ అదే పరిస్థితి

ఇబ్రహీంపట్నం డిపో బస్సులన్నీ మేడారం జాతర బాట పట్టాయి. ఈ డిపోలో ఆర్టీసీ 78, అద్దె బస్సులు 50 వరకు ఉన్నాయి. అందులో సోమవారం 16 బస్సులు వెళ్లగా, మంగళవారం 33 మేడారం వెళ్లనున్నాయి. మేడారంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటే మరిన్ని బస్సులను పంపే అవకాశం ఉందని డిపో అధికారులు చెబుతున్నారు. 78 ఆర్టీసీ బస్సుల్లో 49 జాతర వైపే తిరగనున్నాయి. జాతర పూర్తయి బస్సులు తిరిగి డిపో చేరుకునే వరకు ప్రయాణికులకు తిప్పలు తప్పేలా లేవు. అసలే పెళ్లిళ్ల సీజన్ కావడంతో రద్దీ పెరిగింది. నిత్యం ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులు, పాలు, పూలు, కూరగాయల వ్యాపారులు, దినసరి పనులపై వెళ్లే కూలీలపాటు ఆర్టీసీపై ఆధారపడ్డ ప్రతిఒక్కరూ ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంత రూట్లలో అధికశాతం బస్సులను రద్దు చేశారు. జాతరకు బస్సులు వెళ్లిన సంగతి గుర్తుంచుకొని సహకరించాలని ఆర్టీసీ అధికారులు కోరుతున్నారు. ఈనెల 26వ తేదీ వరకు ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉంది.

ప్రైవేటు వాహనాలే దిక్కు



బస్టాండ్‌కు వచ్చి బస్సుల కోసం అధికారులను అడిగితే అన్నీ జాతరకు వెళ్లాయని చెప్పారు. తప్పనిసరి పరిస్థితుల్లో డబ్బులు ఎక్కువైనా ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించాల్సి వస్తోంది.

– చెన్నయ్య, ప్రయాణికుడు, ఉడిత్యాల

మరిన్ని బస్సులు నడపాలి



బస్సుల రద్దుతో పల్లెల్లో ఉండే పాఠశాలలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. ప్రయాణికులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ అధికారులు గ్రామాలకు మరిన్ని బస్సులు నడిపించాలి.

– శ్రీదేవి, ఉపాధ్యాయురాలు, షాద్‌నగర్

పీఎన్‌బీ నూతన శాఖ ప్రారంభోత్సవం

ఇబ్రహీంపట్నం: భారతదేశంలోని 2వ అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఇబ్రహీంపట్నం శాఖను సోమవారం ప్రారంభించారు. ఈ శాఖను హైదరాబాద్ జోనల్ మేనేజర్ దీపక్‌కుమార్ శ్రీవత్సవ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు రుణగ్రహీతలకు రూ.1.20కోట్ల మేర రిటైల్ రుణాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సర్కిల్ హెడ్ ఎన్‌వీఎస్ ప్రసాద్ రెడ్డి, శ్రీసంపద హోమ్స్ వెంకటరెడ్డి, సిలికాన్ రిసార్ట్స్ వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ ఏటీఎం

అనంతరం పీఎన్‌బీ మొబైల్ ఏటీఎంకు ఎంఆర్‌కేఆర్ కనస్ట్రక్షన్స్ అధినేత ఎం.రఘునందారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. తమ వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకుగాను ఈ మొబైల్ ఏటీఎంలను ఆస్పత్రులు, కళాశాలలు, మార్కెట్లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామని వివరించారు.



పీఎన్‌బీ ఇబ్రహీంపట్నం శాఖ, మొబైల్ ఏటీఎంను ప్రారంభిస్తున్న బ్యాంకు ఉద్యోగులు

తమ్ముడి ఇంటికి వచ్చిన అన్న అదృశ్యం



చంద్రకాంత్ సావంత్ (ఫైల్)

చేవెళ్ల: తమ్ముడి ఇంటికి వచ్చిన అన్న అదృశ్యమయ్యాడు. ఈ ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన చంద్రకాంత్ సావంత్(37), సునీల్‌సాంత్‌లు బతుకుదెరువు నిమిత్తం వలసొచ్చారు. చంద్రకాంత్ సావంత్ సంగారెడ్డి జిల్లా దౌల్తాబాద్‌లో.. సునీల్ సావంత్ చేవెళ్ల మండల కేంద్రంలో వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 17న చంద్రకాంత్ సావంత్ సంగారెడ్డి నుంచి చేవెళ్లలో ఉండే సునీల్ సావంత్ ఇంటికి వచ్చాడు. అదే రోజు సాయంత్రం తమ్ముడి షాపు వద్ద కలిసి రూమ్‌కు వెళ్తున్నట్లు చెప్పి అక్కడ నుంచి బయలుదేరాడు. అనంతరం తమ్ముడి భార్య ప్రియాంకతో కాసేపు మాట్లాడి మళ్లీ వస్తానని వెళ్లిపోయాడు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో సాధ్యమైన అన్ని ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. రెండు రోజులవుతున్నా సోదరుడి జాడ తెలియక పోవడంతో సోమవారం సునీల్‌సావంత్ చేవెళ్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పనిచేసే చోట మహిళ..

ఇబ్రహీంపట్నం రూరల్: పని చేసే చోటు నుంచి ఓ మహిళ అదృశ్యమైంది. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. ఆదిబట్ల ఎస్‌ఐ బాలరాజు తెలిపిన ప్రకారం.. బొంగ్లూర్ నుంచి తుక్కుగూడ వెళ్లేదారిలో కళాజ్యోతి ప్రింటింగ్ ప్రెస్ సమీపంలో ఉన్న ఓ గార్డెన్‌లో పాంగి పార్వతమ్మ, రాంబాబు దంపతులు కొంతకాలంగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 15న ఇంట్లో ఉన్నట్లుండి బయటకు వెళ్లింది. అప్పటి నుంచి కనిపించడం లేదు. ఎక్కడ వెతికిన అచూకీ లభించలేదు. సోమవారం కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో తఉంది.

గంధం చెట్లు గాయబ్!

గంధం చెట్లను నరికి ఎత్తుకెళ్తున్న ముఠా రెచ్చిపోతోంది. రైతులను బెదిరిస్తూ వ్యవసాయ బావుల వద్ద పెంచుకున్న చెట్లను నరికి ఎత్తుకెళ్లడం పరిపాటిగా మారింది. రెండు నెలలుగా మండల పరిధిలో దాదాపు రూ.3కోట్లకు పైగా విలువ 50కి పైగా దుంగలను ఎత్తుకెళ్లారు.

- నగరానికి వెళ్లిన రైతు
- చెట్లు మాయం చేసిన దుండగులు

యాచారం: మండల పరిధిలోని నందివనపర్తిలో కొంగళ్ల జోగిరెడ్డి వ్యవసాయ పొలం వద్దే ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. తన పొలం వద్ద పదికిపైగా శ్రీగంధం చెట్లను పెంచుతున్నారు. ఆయన నగరానికి వెళ్లినట్లు పసిగట్టిన ఈ ముఠా దాదాపు 20 ఏళ్ల వయసున్న రూ.25లక్షలకు పైగా విలువ చేసే చెట్లను నరికి ఎత్తుకెళ్లారు. ఆయన పొలం వద్ద ఉంటున్న వృద్ధులను స్పృహరాకుండా మత్తు ఇచ్చారా.. కుక్కకు సైతం ఏదైనా పెట్టారా అని రైతు అనుమానం వ్యక్తం చేస్తున్నాడు. ఈ మేరకు సోమవారం ఆయన యాచారం సీఐ శంకర్ కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కొద్ది రోజుల క్రితం రాత్రి ఒక్క చెట్టును నరికి తీసుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐ ఈ ముఠా ఆటను త్వరలోనే కట్టడి చేస్తామన్నారు.



నందివనపర్తిలో ఆదివారం రాత్రి నరికిన చెట్టు, కొమ్మలను చూపుతున్న రైతు జోగిరెడ్డి

పగలు రెక్కీ

ఈ ముఠా పగలు రెక్కీ నిర్వహించి రాత్రిళ్లు చెట్లను నరికి వాహనాల్లో తరలించుకుపోతున్నారు. పదిహేను రోజుల క్రితం గడ్డమల్లయ్యగూడలో గంధం చెట్లను నరికే సమయంలో ఈ ముఠా మద్యం, మాసంతో విందు చేసుకుని చెట్లను నరికి తీసుకెళ్లడం సంచలనం సృష్టించింది. దీంతో రైతులు పొలాల వద్దకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. రైతులు ఫిర్యాదు చేయడం.. పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించి కేసులు చేసి దులుపుకొంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అర్హులందరికీ సదరం సర్టిఫికెట్లు

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: అర్హులైన ప్రతీ ఒక్కరికి సదరం సర్టిఫికెట్లు అందించేందుకు చర్యలు తీసుకుంటానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం మాల్ గ్రామానికి చెందిన పలువురు దివ్యాంగులు నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం దివ్యాంగుల విషయంలో చిత్తశుద్ధితో ఉందని చెప్పారు. ఎవరూ ఆందోళన చెందొద్దని.. త్వరలోనే కలెక్టర్‌తో మాట్లాడి స్పెషల్ డ్రైవ్ ఏర్పటు చేయించి నియోకజవర్గంలోని ప్రభుత్వాస్పత్రిలో పరీక్షలు చేయించి సర్టిఫికెట్లు వచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో తిరుమలేశ్, మల్లేశ్ తదితరులున్నారు.



దివ్యాంగుల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

మనోప్రగతి క్యాంప్‌ను వినియోగించుకోండి

ఏపీఎం భగవంతు

కేశంపేట: మానసిక దివ్యాంగులు, బుద్ధిమాద్యం గల పిల్లలు మనోప్రగతి క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం భగవంతు కోరారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో మనోప్రగతి క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ.. 60 ఏళ్ల లోపు ఉన్న దివ్యాంగులకు మనోప్రగతి క్యాంపులో స్పీచ్‌థెరపీ, ఫిజియోథెరపీ, స్పెషల్ ఎడ్యుకేషన్ సేవలను అందిస్తామని చెప్పారు. నెలకు రెండు సార్లు ఈ క్యాంప్ నిర్వహిస్తామని వివరించారు. అర్హులైన ప్రతీ ఒక్కరు ఈ క్యాంపు నెలలో రెండు సార్లు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేటర్ కవిత, స్పీచ్ థెరపిస్ట్ సురక్షిత, సీసీ నర్సింహ, యాదయ్య, అనిత, వసంత, మంజుల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎం భగవంతు


తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడండి

మిషన్ భగీరథ డీఈ విజయశ్రీ

కొందుర్గు: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ డీఈ విజయశ్రీ అధికారులకు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మిషన్ భగీరథ సిబ్బందితో తాగునీటి సరఫరా పై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ.. ఏ గ్రామంలోనూ తాగునీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. మిషన్ భగీరథ నీళ్లు సరిపడని పక్షాన గ్రామాల్లోని బోరు బావులను వినియోగించుకోవాలని సూచించారు. మండల పరిధిలోని అయోధ్యాపూర్ తండాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రమేశ్ కుమార్, ఎంపీడీఓ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సమతాకుంభ్ ఉత్సవాలు

శంషాబాద్ రూరల్: శ్రీరామానుజాచార్య, 108 దివ్య దేశాల ద్వితీయ బ్రహ్మోత్సవాలకు శ్రీరామనగరం ముస్తాబైంది.. మంగళవారం నుంచి మార్చి 1 వరకు జరుగనున్న సమతాకుంభ్–2024 ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ముచ్చింతల్ శివారులోని సమతాస్ఫూర్తి కేంద్రంలో భారీ ఏర్పాట్లు చేశారు. త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామి పర్యవేక్షణలో జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా అష్టాక్షరీ మంత్రజపం, నిత్య పూర్ణాహుతి, 18 దివ్యదేశ మూర్తులకు తిరుమంజనసేవ, విశేష ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర సామూహిక పారాయణ, సాకేత రామచంద్ర స్వామితో పాటు 18 దివ్యదేశ మూర్తులను 18 గరుడులపై యాగశాల ప్రవేశం చేయనున్నారు.



శ్రీరామనగరంలో కొలువైన సమతామూర్తి



యాగశాలలో కొనసాగుతున్న ఏర్పాట్లు

24న క్విజ్ పోటీలు..

ఉత్సవాల్లో భాగంగా 24న గ్లోబల్ రామాయణ క్విజ్ పోటీలను నిర్వహిస్తారు. 25న శాంతి కల్యాణోత్సవం, 26న వసంతోత్సవం, 27న డోలోత్సవం, తదితర కార్యక్రమాలు ఉంటాయి. ప్రతి రోజు మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ప్రధాన వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఐఫోన్ గిఫ్ట్ వచ్చిందని చెప్పి..

రూ.50 వేలకు టోకరా

కొత్తూరు: మీ ఫోన్ నంబర్‌కు గిఫ్ట్ వచ్చిందంటూ నమ్మించి ఓ కార్మికుడి నుంచి సైబర్ మోసగాడు రూ.50 వేలకు టోకరా వేశాడు. ఈ ఘటన కొత్తూరు పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సమీర్ ముర్ము(21) ఓ సంస్థలో దినసరి కూలీగా పని చేస్తున్నాడు. ఉదయం సమీర్ ఫోన్‌కు సైబర్ మోసగాడు కాల్ చేసి మీ ఫోన్ నంబర్‌పై ఐఫోన్ గిఫ్ట్ వచ్చిందని .. అందుకు రిజిస్ట్రేషన్ చేసుకుని కొంత నగదు చెల్లిస్తే మీకు ఫోన్ లేదా ఫోన్ ధరకు సరిపడా నగదు అందిస్తామని నమ్మబలికాడు. ఇది నమ్మిన సమీర్ ఇతరుల ఫోన్ నుంచి మోసగాడు పంపిన స్కానర్‌కు మొదటగా రూ.5వేలు పంపాడు. స్టాక్ లిమిటెడ్‌గా ఉందని చెప్పి మరో రూ.14వేలు పంపాలని చెప్పడంతో రెండో సారి పంపించాడు. చివరగా మరో రూ.31వేలు పంపిస్తే ఫోన్ లేదా నగదు వస్తుందని.. లేదంటే కట్టిన డబ్బు సైతం తిరిగి రావని చెప్పడంతో విడతలవారీగా బాధితుడు మొత్తం రూ.50వేలు పంపించాడు. అనంతరం ఎంతకూ సమాధానం రాకపోవడంతో మోసపోయానని గ్రహించి స్నేహితుల సహకారంతో పోలీసులను ఆశ్రయించాడు.

ఇబ్రహీంపట్నం సీఐగా సైదిరెడ్డి

ఇబ్రహీంపట్నం: 'పట్నం' సీఐగా సైదిరెడ్డిని నియమిస్తూ రాచకొండ సీపీ తరుణ్‌జోషి ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల వచ్చిన ఆంజనేయులుపై బదిలీ వేటు పడింది. మలక్‌పేట్ డీఐగా ఆంజనేయులను బదిలీ చేయగా మల్కాజిగిరి సీసీఎస్ సీఐగా పనిచేస్తున్న సైదిరెడ్డి ఇక్కడికి వచ్చారు.

షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా విజయలక్ష్మి



షాద్‌నగర్: స్థానిక డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా డాక్టర్ విజయలక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖలో డిప్యూటేషన్లు రద్దు చేయడంతో కొంతకాలంగా డిప్యూటేషన్‌పై షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా పని చేసిన డాక్టర్ జయలక్ష్మి భద్రాద్రి కొత్తగూడెం వెళ్లారు. దీంతో షాద్‌నగర్ పీపీ యూనిట్‌లో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ విజయలక్ష్మికి డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు.

గోవాకు 'మణికొండ' రాజకీయం!

మణికొండ: మణికొండ మున్సిపల్ రాజకీయం గోవాకు చేరింది. అవిశ్వాసం పెట్టిన పది మంది కౌన్సిలర్లు ఇప్పటికే గోవా క్యాంప్‌లో ఉండగా, తాజాగా వారితో పాటు మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ సైతం తన ఏడుగురు కౌన్సిలర్లతో ఆదివారం గోవాకు వెళ్లారు.

ముగిసిన హ్యాండ్ బాల్ పోటీలు

మహిళా చాంపియన్‌గా జిల్లా జట్టు

కరీంనగర్‌స్పోర్ట్స్: 52వ తెలంగాణ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో మహిళా చాంపియన్‌గా రంగారెడ్డి, పురుషుల చాంపియన్‌గా వరంగల్ జిల్లా జట్లు నిలిచాయి. పురుషుల విభాగంలో హైదరాబాద్ ద్వితీయ, కరీంనగర్ తృతీయ స్థానం సాధించగా మహిళల విభాగంలో వరంగల్ ద్వితీయ, కరీంనగర్ తృతీయ స్థానాలు సాధించాయి. కరీంనగర్‌లోని లయోలా జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సీనియర్ హ్యాండ్‌బాల్ పోటీలు సోమవారం రాత్రి ముగిసాయి. ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ కొత్త సతీశ్‌రెడ్డి, తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్‌లు హాజరై విజేతలకు ట్రోఫీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హ్యాండ్‌బాల్ క్రీడాకారులు ఇటీవల వివిధ సంస్థల్లో ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్లకు ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పోటీల పరిశీలకుడు దీపక్ ప్రసాద్, కరీంనగర్ జిల్లా యువజన క్రీడాధికారి శ్రీకాంత్‌రెడ్డి, బసరవేణి లక్ష్మణ్, నమిలకొండ ప్రభాకర్, మూల వెంకటేశ్, నర్సయ్య, సత్యానంద్, రాజ్ కుమార్, రూపారాణి, నాగుల శ్రీనివాస్ వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తాగిన మైకంలో తల్లిదండ్రులపై దాడి

కేసు నమోదు చేసిన పోలీసులు


షాబాద్: తాగిన మైకంలో కన్న తల్లిదండ్రులపై దాడి చేసి గాయపరిచిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. షాబాద్ ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి, గ్రామస్తులు తెలిపిన ప్రకారం .. మండల పరిధిలోని కేసారం గ్రామానికి చెందిన తొంట భీమయ్య అలియాస్ భారత్ ఈనెల 18న రాత్రి తప్పతాగాడు. అదే మైకంలో తల్లిదండ్రులు లక్ష్మమ్మ, పెంటయ్యపై కర్రతో దాడి చేసి గాయపరిచాడు. మద్యానికి బానిసైన భీమయ్య తల్లిదండ్రులను తరుచూ ఇబ్బంది పెడుతున్నాడని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయమై షాబాద్ ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదు చేసిన్నట్లు తెలిపారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ ప్రశాంత్‌నగర్ కాలనీలోని శ్రీ మల్లికార్జున ఆలయ స్థలాన్ని ఆక్రమించేందుకు యతిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని యాదవ సంఘం సభ్యులు శేఖర్‌బాబు యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్రకు సోమవారం వినతపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయంలో ఉన్న నాగసర్పం, అమ్మవారి విగ్రహాలను గుర్తు తెలియని దుండగులు దొంగలించారని, అలాగే ఆవరణలోని చింత చెట్టును కూడా నరికి వేశారన్నారు. దేవాలయ భూమిని ఆక్రమించేందుకే ఈ పనులు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ విషయమై పోలీసులు, అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో హనుమంత్, పాపయ్య యాదవ్, రమేశ్‌యాదవ్, వేణుయాదవ్, రాజు యాదవ్ పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్ బోల్తా

పంచాయతీ కార్మికుడి దుర్మరణం



కిష్టయ్య(ఫైల్)

కొందుర్గు: వాటర్ ట్యాంకర్ బోల్తాపడి పంచాయతీ కార్మికుడు మృతి చెందాడు. ఈ దుర్ఘటన జిల్లేడ్‌చౌదరిగూడ మండలం తూంపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సక్రం తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన అల్లం కిష్టయ్య(52) నాలుగేళ్లుగా గ్రామ పంచాయతీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. మొక్కలకు నీరు పోసేందుకు ట్యాంకర్ నింపుకొని గ్రామం నుంచి నర్సరీవైపునకు వెళ్తున్నాడు. ఉదయం 11గంటల ప్రాంతంలో ట్యాంకర్ బోల్తాపడడంతో కిష్టయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు పవన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న ట్లు ఎస్‌ఐ తెలిపారు. కిష్టయ్య మరణ వార్తతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రభుత్వ బడులు, ఆస్పత్రుల్లో మెరుగైన సౌకర్యాలు

- సినీనటుడు సోనూసూద్
- రూ. 60 లక్షలతో దాత సిద్దురెడ్డి నిర్మించిన సర్కారు బడి ప్రారంభం

శంషాబాద్: తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వాసుపత్రులు, సర్కారు బడుల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని సినీనటుడు సోనుసూద్ అన్నారు. వ్యాపార వేత్త సిద్దురెడ్డి సొంత నిధులు రూ. 60 లక్షలతో నిర్మించిన సిద్ధాంతి హరిజనవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని సోమవారం చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సోనూసూద్ మాట్లాడుతూ.. తెలుగు సినిమా, తెలుగు ప్రజలతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. తెలుగు అమ్మాయినే తాను వివాహం చేసుకున్నానని గుర్తు చేశారు..ఇక్కడి ప్రజలకు సేవలందించేందుకు తాను ఎల్లవేళలా సిద్ధంగా ఉంటానన్నారు. భవిష్యత్తు తరాలను తీర్చిదిద్దే విద్యాలయాలకు సేవచేసే అవకాశాన్ని వదులుకోవద్దన్నారు. సిద్దురెడ్డి సేవలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని తాను కూడా తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ బడులు, ఆస్పత్రులకు సేవ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలకు కొత్త భవనం నిర్మించినందుకు ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అభినందించారు. ఈ సందర్భంగా దాత సిద్దురెడ్డి మాట్లాడుతూ తన స్నేహితుడు కౌన్సిలర్ మేకల వెంకటేష్ సూచన మేరకు పాఠశాల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ రాంరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్, ఎంపీపీ జయమ్మ, జెడ్పీటీసీ నీరటి తన్వీ, మాజీ సర్పంచులు ఆర్. గణేష్‌గుప్తా, రాచమల్ల సిద్దేశ్వర్, కౌన్సిలర్లు మేకల వెంకటేష్, అజయ్, అమృత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సినీనటుడు సోనూసూద్